జగదీశ్‌రెడ్డి వర్సెస్ కోమటిరెడ్డి

రాజీనామాకు రెడీ.. మీరూ సిద్ధమేనా?

- **కేసు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా: జగదీశ్‌రెడ్డి**
- **నిరూపించకుంటే రాజీనామా చేస్తా: కోమటిరెడ్డి**
- **సభలో అధికార, ప్రతిపక్షాల సవాళ్ల పర్వం**

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లతో సోమవారం జరిగిన సభ దద్దరిల్లింది. విద్యుత్తు రంగంపై మాట్లాడుతుండగా ముఖ్యమంత్రి కలుగజేసుకొని జగదీశ్‌రెడ్డి వ్యక్తిగత ప్రస్తావన తీసుకొచ్చారు. అనంతరం జగదీశ్‌రెడ్డి అక్రమాలు చెప్పాలని మంత్రి కోమటిరెడ్డిని కోరారు. వెంటనే మైక్ అందుకున్న మంత్రి కోమటిరెడ్డి.. జగదీశ్‌రెడ్డిపై హత్య కేసులు, దొంగతనాలు, మద్యం కేసులు ఉన్నాయని దూషించారు. దీంతో సభంతా ఒక్కసారిగా ఆర్డర్ తప్పింది.

హత్య కేసుల్లో ప్రధాన నిందితుడు

‘గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి హత్య కేసులో ఏ2, భిక్షం అనే వ్యక్తి హత్య కేసులో ఏ6, తండ్రి ఏ7, రామిరెడ్డి హత్యకేసులో ఏ3గా జగదీశ్‌రెడ్డి ఉన్నాడు. దోసపాటి గోపాల్ అనే వ్యక్తి దగ్గర దొంగతనం చేసిండు. మద్యం కేసులోనూ పట్టుబడ్డడు. ఈయన గురించి మాట్లాడితే మా గౌరవం పోతుంది’ అని మంత్రి అనగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోడియం వద్ద ఆందోళనకు దిగారు.

ఒక్క కేసు నిరూపించినా రాజీనామా చేస్తా

‘మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలను రికార్డు నుంచి తీసెయ్యాలి. ఆయన చెప్పిందాంట్లో ఒక్కటి రికార్డు చూపించినా, ఇదే సభలో ముక్కు నేలకు రాస్తా. రాజీనామా చేస్తా. లేకపోతే ముఖ్యమంత్రి, మంత్రి రాజీనామా చేయాలి. ఒక్కటి నిరూపించలేకపోయినా ఇద్దరూ ముక్కు నేలకు రాయాలి. నేను రెడీగా ఉన్నా. ఈ చెత్తమాటలను రికార్డుల నుంచి తొలగించండి. లేదంటే నా సవాల్‌కు సిద్ధంగా ఉండాలి’ అంటూ జగదీశ్‌రెడ్డి దీటుగా సమాధానం ఇచ్చారు. ‘నేను ఆయన చాలెంజ్‌కు సిద్ధం. నేను నిరూపిస్తా. లేకపోతే మంత్రి పదవి అన్నీ వదిలేసి బయటికిపోతా. నల్లగొండ ఎస్పీ నుంచి రికార్డు తెప్పించుకోండి. చాలెంజ్‌కు ఒప్పుకుంటున్నా’ అని కోమటిరెడ్డి ప్రతి సవాల్ విసిరారు.

హౌస్ కమిటీని వేయండి

‘నాపై మూడు హత్య కేసులు ఈ కాంగ్రెస్ వాళ్లే పెట్టించారు. మూడు కేసుల్లోనూ కోర్టు నన్ను నిర్దోషిగా ప్రకటించింది. ఇది కాకుండా ఉద్యమ కేసులున్నాయి. ఇవి కాకుండా ఇంకొక్క కేసున్నా. నా సవాల్‌ను స్వీకరించాలి. స్పీకర్ హౌస్ కమిటీ వేయాలి. మిగతా ఏ కేసును నిరూపించినా నేను నిల్చుదగ్గర్నుంచి స్పీకర్ చైర్ వరకూ ముక్కు నేలకు రాస్తా. లేకపోతే సీఎం, మంత్రి కోమటిరెడ్డి ఇద్దరూ రాజీనామా చేయాలి’ అంటూ జగదీశ్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

ఎవరు డీవియేట్ అయ్యారు?

‘జగదీశ్‌రెడ్డి సబ్జెట్ డీవియేట్ చేయకుండా మాట్లాడాలి’ అని స్పీకర్ కోరడంతో ‘ఎవరు ఎవర్ని డీవియేట్‌చేస్తున్నారు? ఎవరు చేశారు? సీఎం రాకతోనే కదా ఇంత జరిగింది అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

అదానీకి ‘పవర్’ కట్టబెట్టే కుట్ర

- **ప్రభుత్వరంగ బీహెచ్‌ఈఎల్‌పై నిందలా?**
- **ఇవ్వాలనుకుంటే ప్రైవేటుకు ఇచ్చేవాళ్లం**
- **మీలాగా సంచులు మోసేటోళ్లం కాదు**
- **కేసీఆర్ గోటికి కూడా మీరు సరిపోరు**
- **కేసులు నిరూపిస్తే రాజీనామా చేస్తా**
- **సీఎం, మంత్రి కోమటిరెడ్డి సిద్ధమా?**
- **విద్యుత్తుపై అధికార పక్షాన్ని ఎండగట్టిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇకపై ప్రభుత్వం నిర్మించబోయే విద్యుత్తు ప్రాజెక్టులను అదానీకి ఇచ్చే కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీహెచ్‌ఈఎల్‌పై కాంగ్రెస్ నేతలు నిందలు వేస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘బీహెచ్‌ఈఎల్‌కు వద్దు.. అదానీకి ఇవ్వాలనేది మీ ఆలోచన. మొత్తం విద్యుత్తు రంగాన్ని అదానికి అప్పగించాలనే ఆలోచన మీది. డిస్కంలను తీసుకొని పోయి వాళ్లకు అప్పగించాలని చూస్తున్నారు. డైరెక్ట్‌గా మాట్లాడలేక పేపర్ల చిట్‌చాట్‌లతో దొంగ రాతలు రాయిస్తున్నారు. కానీ, మీ బాగోతం ప్రజలు చూస్తున్నారు. మా దగ్గర ఏదో మతలబు ఉందనుకుంటే చంద్రబాబు లాగే మేము కూడా నాడు ప్రైవేట్‌కే ఇచ్చేవాళ్లం కదా? రేపు కాంగ్రెస్ కట్టబోయే ప్రాజెక్టులను బీహెచ్‌ఈఎల్‌కి ఇవ్వాల్సి వస్తున్నదన్న భయంతో, మనసులో తప్పుడు ఆలోచనలు పెట్టుకొని ఇప్పట్నుంచే పథకం ప్రకారం మాట్లాడుతున్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ నిర్మించే ప్రాజెక్టులు ప్రభుత్వ రంగ సంస్థలకే ఇవ్వాలి’ అని విద్యుత్తు రంగంపై సోమవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు పెట్టించాలనే ఉద్దేశంతోనే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని సభ సాక్షిగా తప్పుదోవ పట్టించారని విమర్శించారు. బీఆర్‌ఎస్ కృషి వల్లే పదేండ్ల పాటు తెలంగాణ విద్యుత్తు వెలుగులతో విరాజిల్లిందని తెలిపారు. తమ హయాంలో ఒక్క ఇంటిపై నుంచి కూడా విద్యుత్తు లైన్ వెయ్యలేదని గుర్తుచేశారు. 2014 కంటే ముందు వేసిన లైన్ల కింద కొందరు పేదలు ఇండ్లు కట్టుకున్నారని, కొందరు రెండంతస్తులు కట్టుకున్న చోట్ల కూడా లైన్లు తీయించినట్టు వివరించారు.

‘రాముడితోక పివరుండిట్లనియే’ అన్న చందంగా

శనివారం సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో చాలా తెలివిగా వ్యవసాయేతర మీటర్లకు మాత్రమే అనే అంశాన్ని దాచిపెట్టి వ్యవసాయ మీటర్లకు కూడా తాము కేంద్రం దగ్గర ఎఫ్‌ఆర్‌బీఎం కోసం ఒప్పుకున్నట్టు మాట్లాడిన తీరు బాగోలేదని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మాట్లాడాల్సిన తీరులో మాట్లాడకుండా ‘రాముడితోక పివరుండిట్లనియే’ (రామునితో కపివరుండిట్లనియే) అన్న చందంగా సీఎం మాట్లాడడం బాధాకరమన్నారు. సీఎం వ్యాఖ్యల సభ రికార్డులను సవరించాలని డిమాండ్ చేశారు. ‘ఉదయ్’ పథకంలో అప్పటికే 27 రాష్ట్రాలు చేరాయని, డిస్కంల ఆర్థిక పరిస్థితిని సరిదిద్దడానికి, క్రమశిక్షణ కోసం తీసుకున్న నిర్ణయమని నాడు కేంద్రం చెప్పిందన్నారు. తమకంటే ముందే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అందులో చేరాయని తెలిపారు. అయితే, ‘తల తెగినా వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు పెట్టబోమని నాటి సీఎం కేసీఆర్ చెప్పారు. ఈ విషయం అందరికీ తెలియాలి. అయినా, సీఎం ఆ విధంగా మాట్లాడం బాధాకరం’ అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

24 గంటల కరెంటే కేసీఆర్ లక్ష్యం

రాష్ట్రంలోని అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు అందాలనేది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. అందుకే నాడు సీఎండీలను ఏర్పాటుచేసి ఆ దిశగా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నాడు 6 నెలల్లోనే ఒక్క వ్యవసాయ రంగం మినహా అన్నింటికీ 24 గంటల విద్యుత్తు ఇచ్చినట్టు చెప్పారు. 2014 నవంబర్ నాటికే లక్ష్యాన్ని చేరుకున్నట్టు తెలిపారు. ట్రాన్స్‌ఫర్మేషన్, డిస్ట్రిబ్యూషన్ సమస్యలు తీర్చి రైతులకు కూడా 24 గంటల ఉచిత విద్యుత్తు ఉండాలని కేసీఆర్ ఆదేశించారని, ఆ దిశగానే రైతులకు ఉచిత కరెంటు ఇవ్వగలిగామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఇంతలా బాగు చేసుకోవడానికే నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పు చేయాల్సి వచ్చిందని చెప్పారు. రూ.90వేల కోట్లు పెట్టి మొత్తం డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌ఫర్మేషన్ వ్యవస్థలను బలోపేతం చేసినట్టు వివరించారు. మొదటి టర్మ్‌లో భట్టి, జానారెడ్డి అడిగిన ప్రశ్నలకు కూడా ఇవే సమాధానాలు చెప్పినట్టు తెలిపారు. ఎందులో చూసినా, ఎటు చూసినా అంతా 100 శాతం డబుల్ చేశామని అయితే, 8 నెలలుగా కాంగ్రెస్ ఒక్క లైన్ కానీ, ట్రాన్స్‌ఫార్మర్ కానీ ఇవ్వలేదని జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

మీకు మేమే ఎక్కువ

2014లో తెలంగాణ విద్యుత్తు రంగం రూ.24వేల కోట్లతో తమ చేతికి వచ్చిందని జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఇన్ని ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, లైన్లు, కొత్త పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలంటే ‘మంత్రాలు చేస్తే అయితయా? మంత్రాలతో అభివృద్ధి జరుగుతుందా?’ అని ప్రశ్నించారు. తప్పకుండా అప్పు చేయాల్సి వచ్చిందని, అందుకే అప్పులు తెచ్చినం, అన్నీ కట్టినం, సంపాదించినం అని చెప్పారు. ‘కలుగులోంచి ఏదో పట్టుకున్నట్టు ఎందుకు ప్రజలను భ్రమింపజేస్తున్నారు? ఇప్పటికీ చెబుతున్నాం. ఆ పెద్ద మనిషి (కేసీఆర్) వీళ్లకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మేమే ఎక్కువ’ అంటూ తనదైన శైలిలో కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడ్డారు. ‘పిట్‌హెడ్ విజయవాడలో కడితే ఒప్పు. నల్లగొండలో కడితే తప్పా? ఎందుకంటే మీ బాసులంతా విజయవాడలో ఉన్నారనా? మాకు అలా కాదు. తెలంగాణ ప్రజలంతా మా బాస్‌లే. నల్లగొండ ప్రజలు కూడా మా బాస్‌లే. అందుకే తెలంగాణలో కట్టినం. నల్లగొండకు 60 ఏండ్లలో వెయ్యిమంది పనిచేసే ఒక్క కంపెనీ కూడా తేలేదు. ఫ్లోరైడ్‌ను నల్లగొండ నుంచి పారదోలాం. రోడ్డు, నీరు, రైలుమార్గం ఉన్న నల్లగొండలోనే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టినం. నల్లగొండలో కట్టడం పెద్ద నేరం అన్నట్టు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. ఇది నల్లగొండ ప్రజలు గమనించాలి’ అని రాష్ట్ర ప్రజలను కోరారు.

సూపర్ క్రిటికల్.. సబ్ క్రిటికల్ తెల్వదా?

‘కాంగ్రెస్ సభ్యులకు ఇప్పటికే సూపర్ క్రిటికల్, సబ్ క్రిటికల్ గురించి చాలాసార్లు చెప్పాం. అర్థంకాకనో, ప్రజలను తప్పుదోవ పట్టించడానికో మళ్లీ మళ్లీ ప్రస్తావిస్తున్నారు’ అని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014కి ముందు ప్రపంచమంతా సబ్ క్రిటికల్ టెక్నాలజీనే వాడిందని, 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి మించితే అది సూపర్ క్రిటికల్ అని, అంతకంటే తక్కువ ఉత్పత్తి చేస్తే దాన్ని సబ్ క్రిటికల్‌గా పిలుస్తున్నారని తెలిపారు. ‘నాడు మన లక్ష్యాన్ని చేరుకోవాలని సబ్‌క్రిటికల్ టెక్నాలజీలో నిర్మాణం కోసం బీహెచ్‌ఈఎల్‌ను సంప్రదించాం. ఓ ప్రభుత్వం, మరో ప్రభుత్వ రంగ సంస్థతో ఒప్పందం చేసుకుంటే ఇందులో అక్రమాలు ఎలా జరుగుతాయి? ప్రభుత్వానికి ఏ రకంగా మోసం చేయడానికి అవకాశం ఉంటుంది? బీహెచ్‌ఈఎల్ నుంచి లంచాలు ఇస్తారా? ఓ ప్రభుత్వ రంగ సంస్థ నుంచి మరో ప్రభుత్వ రంగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో ఇవ్వొచ్చు అని ఆ నిబంధనల్లో ఉంది’ అని వివరించారు.

ఎక్కువ ఖర్చు చేసేది ఎవరు?

‘ఛత్తీస్‌గఢ్ పవర్‌కు ఆ నాడు మనం యూనిట్‌కు రూ.3.90 ఇచ్చాం. ఇప్పుడు కాంగ్రెస్ రామగుండం ఎన్టీపీసీ నుంచి తీసుకునేందుకు యూనిట్‌కు రూ.5.70 ఇస్తున్నది. ఇది నిజమో కాదో చెప్పాలి’ అంటూ జగదీశ్‌రెడ్డి నిలదీశారు. ‘ఈ ఛత్తీస్‌గఢ్ ఒప్పందం వల్ల నష్టం జరిగిందా? లాభం జరిగిందా? చెప్పాలి. అప్పుడు ఇచ్చింది ప్రభుత్వమే, తీసుకున్నది కూడా ప్రభుత్వమే. ఇందులో ఏం మతలబు ఉన్నది? మతలబుల సంగతి మీకే ఎరుక’ అని చురకలు అంటించారు. ‘నాడు విజయవాడలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి చంద్రబాబు రూ.4,700 కోట్లు, కృష్ణపట్నం ప్లాంట్‌కు రూ.5వేల కోట్లకు ఇచ్చారు. మనం కొత్తగూడెం పవర్‌ప్లాంట్‌ను బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చింది రూ.3,800 కోట్లకు. ఈ చొప్పున ఎవరు డబ్బులను ఆదా చేశారు? ఎవరు వృథా చేశారు?’ అని ప్రశ్నించారు.

నా ఆస్తుల మీద కమిషన్ వేసుకోమన్నా

విద్యుత్తుపై వేసిన కమిషన్ ఎంతో నిక్కచ్చిగా ఉండాలని జగదీశ్‌రెడ్డి తెలిపారు. కమిషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ నియమించిన వ్యక్తిపై నాటి పీసీసీ చీఫ్, నేటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వీ హనుమంతురావులు అతనొక భూ కబ్జాదారుడని కేసు వేసినట్టు గుర్తు చేశారు. ‘ఆ కమిషన్ విషయంపై మాట్లాడొద్దని అంటున్నారు. ఆ విషయం సభలోకి తెచ్చింది ముఖ్యమంత్రి. దానిపై మాట్లాడొద్దా? ఆ భూమి కూడా ఎక్కడిదో కాదు స్వయంగా ఓయూకు సంబంధించిన భూమి అది. దానిపై ఎఫ్‌ఐఆర్ అయింది. అందుకే మేము వ్యక్తిని మార్చాలని కోరాం’ అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. సాధారణ కోర్టుల్లో కూడా న్యాయం జరగదని అనుకున్నపుడు పైకోర్టులకు వెళ్లే హక్కు ఉంటుంది. అందుకే కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు న్యాయంగా తీర్పు చెప్పింది అంటూ కాంగ్రెస్ కుట్రలను బయటపెట్టారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే విద్యుత్తు వెలుగులు

- 2-6-2014 నాటికి విద్యుత్తు కాంట్రాక్టెడ్ కెపాసిటీ 7,778 మెగావాట్లు ఉండగా, 1-1-2024 నాటికి 19,483 మెగావాట్లతో అదనంగా 11,705 మెగావాట్లు కేసీఆర్ నాయకత్వంలో ఇన్‌స్టాల్ కెపాసిటీ పెరిగింది.
- సోలార్ కెపాసిటీ 60 ఏండ్ల కాలంలో 74 మెగావాట్లు ఉండగా, 2024 నాటికి 6,132 మెగావాట్లకు చేరింది.
- పీక్ డిమాండ్ 2014 నాటికి 5,661 ఉండగా, 2024 నాటికి 15,497 మెగావాట్లకు చేరుకున్నది.
- గ్రిడ్ కంజప్షన్ (మిలియన్ యూనిట్లు) 2014లో 128 ఉండగా, 2024లో 297.89కు తీసుకొచ్చారు
- పర్ క్యాపిటా కంజంప్షన్ 2014 నాటికి 1196 కిలోవాట్లు ఉండగా, 2024లో 2,349 కిలోవాట్లకు చేరుకున్నది.
- 2014 వరకు 400 కేవీ సబ్‌స్టేషన్లు 6 ఉంటే, బీఆర్‌ఎస్ హయాంలో వాటిని 28కి చేర్చారు.
- 220 కేవీ సబ్‌స్టేషన్లు నాడు 51 ఉంటే, 2024 నాటికి వాటి సంఖ్యను 105 (53 కొత్తవి)కు పెంచారు.
- 132 కేవీ సబ్‌స్టేషన్లు నాడు 176 ఉంటే నేడు 252 ఉన్నాయి.
- ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు నాడు 233 ఉంటే ఇప్పుడు 384 ఉన్నాయి.
- ఈహెచ్‌టీ లైన్ లెన్త్ నాడు 16,379 సీకేఎం ఉంటే నేడు 28,506గా ఉంది.
- ట్రాన్స్‌ఫర్మేషన్ కెపాసిటీ నాడు 14,973 ఉంటే నేడు 41,115కు పెంచి మూడురెట్లు అధికం చేశారు.
- 33 కేవీ సబ్‌స్టేషన్లు 2014 నాటికి 2,138 ఉంటే 2024 నాటికి 3,224కు చేర్చారు.
- అన్ని లైన్స్ కలిపి 4,89,000 కి.మీ.ఉంటే నేడు 6,53,000 కిలోమీటర్లకు చేర్చారు.
- పీటీఆర్‌లు నాడు 3,272 ఉంటే నేడు 5712 చేశారు.
- డీటీఆర్‌లు నాడు 4,67,000 ఉంటే నేడు 8,76,000 ఉన్నాయి.
- అగ్రికల్చర్ సేవల్లో 19 లక్షలు ఉంటే నేడు 28 లక్షలకు చేరింది.
- మొత్తం సర్వీసులు నాడు 1.11 కోట్లు ఉంటే నేడు 1.83 లక్షలు అయింది.

కరెంటు అడిగితే కేసులు పెట్టిందే కాంగ్రెస్

‘నాడు పది నిమిషాలు కరెంటు రాకపోతే నాకు ఫోన్ వచ్చేది. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేవాళ్లం. ఇప్పుడు కరెంటు పోతే, కరెంటు కావాలని అడిగితే కేసులు పెట్టే దుస్థితి వచ్చింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీతా కృష్ణన్ అనే సామాజిక వేత్త ఎక్స్‌లో పోస్టు చేస్తే కరెంటు ఇవ్వకపోగా ఆ పోస్టు తీసెయ్యమని బెదిరించారు. ఆఖరికి జర్నలిస్టులు సైతం కరెంటుపై నిలదీస్తే కేసులు పెట్టే పరిస్థితి వచ్చింది’ అని జగదీశ్‌రెడ్డి సభలో ఆవేదన వ్యక్తం చేశారు. నాడు సీఎం రేవంత్‌రెడ్డి తండ్రి చనిపోయినప్పుడు కరెంటు కోతలపై ఆయన చెప్పిన మాటలు ఇంకా గుర్తున్నాయంటూ వాటిని ప్రస్తావించారు. ఎంజీఎం, భువనగిరి, ఆదిలాబాద్ దవాఖానల్లో కరెంటు పోతే సెల్‌ఫోన్ల లైట్ల వెలుతురులో ఆపరేషన్లు జరుగుతున్నాయని పత్రికల్లో వచ్చాయని తెలిపారు. జైపాల్‌రెడ్డితో కుస్తీపట్టి 53శాతం విద్యుత్తు వినియోగం చేయించామని నాటి కాంగ్రెస్ ఎంపీలు కూడా ఎప్పుడూ చెప్పుకోలేదని తెలిపారు.

లోకం పోకడ



వడ్డీలు కట్టడానికి రుణం ఇచ్చి పుణ్యం కట్టుకోండి సారూ!

కౌంటర్.. ఎన్‌కౌంటర్

బీఆర్‌ఎస్ అడిగితేనే కమిషన్ వేశాం

విచారణకు ఇస్తే గుండెలు బాదుకుంటరెందుకు?
సత్యహరిశ్చంద్రులైతే ముందుకు రండి: రేవంత్
కాంట్రాక్టులు చేసే అలవాటు నాది కాదు.. మీది
కాంట్రాక్టర్లలో నా చుట్టపోడు ఎవరు: జగదీశ్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వాదన, ఆక్రోశం, ఆవేదన చూస్తుంటే ఆల్రెడీ చర్లపల్లి జైలులో ఉన్నట్టు ఉంది. జ్యుడీషియల్ ఆర్డర్ ఇస్తామని మేము అనలేదు. అయితే వారు, మేము సత్యహరిశ్చంద్రులం, ఆ వంశంలోనే ఉన్నాం. ఆయన తర్వాతే కలియుగంలో కేసీఆర్ జన్మించిండని వారే అడిగారు. మీరు నిజాయతీ పరులు, సత్యహరిశ్చందులైతే మీరెందుకు అక్కడ వాదన వినిపించలేదు? - రేవంత్‌రెడ్డి

సీఎం ఎందుకు జైలు జీవితం గుర్తు చేసుకుంటున్నారు. చర్లపల్లి జైలు జీవితం వారికి అనుభవం కాబట్టి. వారు మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ ఎట్లాగూ అక్కడికే వస్తానని అనుకుంటున్నాడేమో. మా జ్ఞపకాలు మాకుంటయి. వారి జ్ఞాపకాలు వారికి ఉంటయి. ఉద్యమకాలంలో నన్ను అరెస్టు చేశారు కాబట్టి చంచల్‌గూడ జైలు గుర్తుంది. ఆయన సంచులు మోశారు కాబట్టి చర్లపల్లి మాత్రమే గుర్తుంటుంది. - జగదీశ్‌రెడ్డి

బీహెచ్‌ఈఎల్‌కు ‘బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్ వర్క్’ చేసే అధికారం లేదు. ఆ సివిల్ వర్క్‌లో బీఆర్‌ఎస్ అవినీతికి పాల్పడింది. వారి బినామీలు, బంధువులు, అయినోళ్లకు ఇచ్చుకుంది. వందల కోట్ల కుంభకోణానికి పాల్పడింది. విచారణకు ఇస్తే ఎందుకు గుండెలు బాదుకుంటున్నారు? బీహెచ్‌ఎల్ నుంచి సివిల్ వర్క్‌లు ప్రైవేట్‌వాళ్లకు, వాళ్ల బినామీలకు ఇచ్చారు. అందులో భారీ మోసం జరిగింది - సీఎం రేవంత్‌రెడ్డి

సబ్ కాంట్రాక్టులు ఇచ్చామని సీఎం చెబుతున్నారు. అందులో ఒక్కడు కూడా కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ నాకు తెల్వదు. ఉంటే గింటే మీ చుట్టాలు అందులో ఉండాలె. నా చుట్టపోడు ఒక్క కాంట్రాక్టర్ లేడు. నా చుట్టపోడు ఒక్కడ్ని నిరూపించినా దేనికైనా సిద్ధంగా ఉన్నా. కాంట్రాక్టులు చేసే అలవాటు మీది. బీహెచ్‌ఈఎల్‌కు వద్దు.. అదానీకి ఇవ్వాలనేది మీ ఆలోచన - జగదీశ్‌రెడ్డి

జార్ఖండ్‌లో 2017, జూలై 18న 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్‌కు టెండర్లు పిలిస్తే.. ఒక కొరియన్ కంపెనీ, బీహెచ్‌ఈఎల్‌కు, ఎల్‌అండ్‌టీ వచ్చాయి. అక్కడ ఇదే బీహెచ్‌ఈఎల్ 18శాతం తక్కువగా కోట్ చేసి, ఆ వర్క్ సొంతం చేసుకుంది - సీఎం రేవంత్‌రెడ్డి

2017 మార్చి చివరి నాటికి పూర్తి కాగలిగిన ప్లాంట్‌లను సబ్ క్రిటికల్ ద్వారా కూడా పూర్తి చేసుకోవచ్చు. ఆ తర్వాత పూర్తయ్యేవి సబ్ క్రిటికల్‌లోకి రావు అన్ని కేంద్రం తేల్చి చెప్పింది. అప్పటి విద్యుత్తు అవసరాల దృష్ట్యా బీహెచ్‌ఈఎల్‌తో కేసీఆర్ మాట్లాడారు. కేటీపీపీని ఇచ్చాం. సివిల్ వర్క్‌ను చేసుకుంటే రెండేండ్లలో పూర్తి చేస్తామని వారు చెప్పారు. మార్చి 2017 లోపే పూర్తి చేస్తామని చెప్పారు. ఆ తర్వాత ఎన్‌జీటీ కేసు, కరోనా వల్ల ఆలస్యమైంది. అయినా తక్కువ సమయంలో పూర్తిచేశాం. యాదాద్రితోపాటు, కొత్తగూడెం ప్రాజెక్టు కూడా బీహెచ్‌ఈఎల్‌కే ఇచ్చాం’ - జగదీశ్‌రెడ్డి

‘కుంభకోణానికి ఆద్యులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన గురువు కేసీఆర్. వారి అవినీతి చరిత్ర’ - సీఎం రేవంత్‌రెడ్డి

‘నేను మాట్లాడే మాటల్లో ఏమైనా తప్పుందా? ఎందుకు ముఖ్యమంత్రి భుజాలు తడుముకుంటూ దూసుకొచ్చిండు? మీ దొంగతనం దొరికిపోతుంది కాబట్టే భయపడ్డరు. ఎస్.. మా నాయకుడు కేసీఆర్ హరిశ్చంద్రుడే. మీలాగా సంచులు మోసే చంద్రుడు కాదు. మీ చంద్రుడికి సంచులు మోసి జైలుకు పోయింది నువ్వు. మా నాయకుడు హరిశ్చందుద్రే - జగదీశ్‌రెడ్డి

గుజరాత్‌కు చెందిన ఇండియా బుల్ అనే కంపెనీ అక్కడ 1000 మెగావాట్ల నిర్మాణానికి సబ్‌క్రిటికల్‌లో బీహెచ్‌ఈఎల్‌తో ఒప్పందం చేసుకుంది. మళ్లీ యాక్ట్ మారడంతో వాళ్లు తాము కట్టిన పైసలు ఇవ్వాలని అడిగితే, మీరే మా ఖర్చుకు ఎక్కువ ఇవ్వాలని బీహెచ్‌ఈఎల్ ఎదురు తిరిగింది. అప్పుడు బీహెచ్‌ఈఎల్ జగదీశ్‌రెడ్డిని పట్టిస్తే, ఇండియా బుల్ నుంచి వెయ్యి కోట్లు మెక్కి సబ్ కాంట్రాక్టులు వాళ్ల వారికి ఇచ్చుకున్నారు - సీఎం రేవంత్‌రెడ్డి

ఆ ఇండియా బుల్స్ ఎక్కడో తెల్వదు. మీరే వారిని పట్టుకొచ్చారు. వారి దగ్గరకు వీరెందుపోయారో? దేనికి దొరికిండ్రో అది సీఎంకే ఎరుక. ఆ బుల్స్ సంగతీ సీఎంకే ఎరుక. ప్రతీసారి వీళ్లు కేసీఆర్ గురించి మాట్లాడతారు. వీళ్లు కేసీఆర్ కాలి గోటికి సరిపోతరా? - జగదీశ్‌రెడ్డి

మీటర్లపై ఎవరిది మోసం?



ఉదయ్ స్కీం, ఎఫ్‌ఆర్‌బీఎంకు సీఎం లంకె

- రెండింటినీ, ఒకటిగా చూపుతూ ఏమార్చే యత్నం
- వ్యవసాయేతరానికే మీటర్లని పేర్కొన్న ‘ఉదయ్’
- అందుకే, సంతకం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- ఎఫ్‌ఆర్‌బీఎం రూల్స్‌తో అన్నదాతలకు తీరని నష్టం
- అందుకే, దానిని వ్యతిరేకించిన బీఆర్‌ఎస్ సర్కారు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల బిగింపునకు రంగం సిద్ధమైందా? విద్యుత్తు వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడిందా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఇందుకు బలాన్నిస్తున్నాయి. కేంద్రంతో గత బీఆర్‌ఎస్ సర్కారు చేసుకొన్న ఒప్పందం కారణంగానే స్మార్ట్ మీటర్లు బిగించాల్సి వస్తున్నదని ముఖ్యమంత్రి ఆరోపిస్తున్నారు. 2017 జనవరిలో కేంద్ర ప్రభుత్వంతో, అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, రాష్ట్ర డిస్కంలు త్రైపాక్షికంగా చేసుకొన్న ‘ఉదయ్’ ఒప్పందాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. అయితే, వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టడానికి తాము ఒప్పుకోలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు నిక్కచ్చిగా చెప్తున్నారు. 2021 జూన్ 9నాటి కేంద్రం ఎఫ్‌ఆర్‌బీఎం రుణ ప్రతిపాదనలకు, 2017లో తీసుకొచ్చిన ఉదయ్ స్కీంకు ముడిపెట్టి విద్యుత్తు స్మార్ట్ మీటర్ల అంశంలో సీఎం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఏమిటీ ‘ఉదయ్’ ఒప్పందం?

2017 జనవరి 2న కేంద్ర ప్రభుత్వం ‘ఉదయ్’ పథకాన్ని తీసుకొచ్చింది. కాంగ్రెస్, బీజేపీపాలిత రాష్ట్రాలతో కలిపి మొత్తం 27 రాష్ట్రాలు దీనిపై సంతకాలు చేశాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ డిస్కంలు కలిపి ఈ ‘త్రైపాక్షిక ఒప్పందం’పై 2017 జనవరి 4న సంతకాలు చేశాయి. డిస్కంల ఆర్థిక పరిస్థితిని సరిదిద్దడానికి, సంక్షోభంలో చిక్కుకొన్న డిస్కంలను బయటపడేసేందుకు, డిస్కంల అప్పులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించేలా ఈ పథకాన్ని తీసుకొచ్చినట్టు కేంద్రం వెల్లడించింది.

‘ఉదయ్’ త్రైపాక్షిక ఒప్పందంలో ముఖ్యాంశాలు..

తెలంగాణ డిస్కంలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. వీటి రెవెన్యూ లోటు 2016-17లో రూ.4,380 కోట్లు. 2015 మార్చి 31 నాటికి డిస్కంల నష్టాలు రూ.9,875 కోట్లు, 2015 సెప్టెంబర్ నాటికి అప్పులు రూ.11,897 కోట్లకు చేరాయి. ఈ అప్పుల నుంచి డిస్కంలను బయటపడేయడమే ఈ స్కీం ముఖ్యోద్దేశం.త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం.. అప్పుల్లో 75% డిస్కంల పేరుపై నుంచి రాష్ట్ర ప్రభుత్వం పేరు మీదకు 2017 మార్చి 31నాటికి బదిలీ అయ్యింది. విద్యుత్తు నష్టాలను తగ్గించడానికి ఒప్పందం ప్రకారం.. డిస్కంలు కింది నిబంధనలు అమలుచేయాలి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు ఫీడర్ల వద్ద 2017 జూన్ 30 నాటికల్లా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయాలి. వ్యవసాయ వినియోగదారులు మినహా.. 500 యూనిట్లలోపు వాడే కనెక్షన్లకు 2018 డిసెంబర్ 31నాటికి, 200 యూనిట్లలోపు వాడే కనెక్షన్లకు 2019 డిసెంబర్ 31నాటికల్లా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయాలి. రాష్ట్రంలోని అన్ని 11 కేవీ ఫీడర్ల వద్ద కరెంటు ఎంత సరఫరా అవుతుందనేది 2018 మార్చి 31కల్లా ఆడిట్ చేసి నివేదిక ఇవ్వాలి. ఆర్థిక క్రమశిక్షణ, డిస్కంల అప్పులను రాష్ట్రప్రభుత్వాలు భరించే వెసులుబాటు ఉండటంతో ఉదయ్ పథకంపై అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంతకాలు చేసింది. ఈ పథకంలో స్మార్ట్ మీటర్ల బిగింపు చేపట్టాలని నిబంధన ఉండగా, అప్పటికే వినియోగదారులందరికీ మీటర్లు ఉండటంతో కేసీఆర్ సర్కారు కొత్తగా మీటర్లను పెట్టలేదు. దీంతో రాష్ట్రంలో ఏ ఒక్క స్మార్ట్ మీటర్ కూడా ఇన్‌స్టాల్ కాలేదు.

ఎఫ్‌ఆర్‌బీఎం నోట్‌లో ఏమున్నది?

విద్యుత్తు రంగంలో సంస్కరణలు తీసుకొస్తామని, డిస్కంల నష్టాలను తగ్గిస్తామంటూ ఎఫ్‌ఆర్‌బీఎం రుణ ప్రతిపాదనల పేరిట ఎఫ్ నంబర్ 40(02)/ ఎఫ్-ఎస్/2020-21తో 2021 జూన్ 9నాడు రాష్ట్రాలన్నింటికీ కేంద్ర ఆర్థిక శాఖ ఒక నోట్‌ను పంపించింది. ఏ రాష్ట్రాలైతే, ఎఫ్‌ఆర్‌బీఎంలో అనుమతించిన దానికంటే 0.5% అదనంగా అప్పు తీసుకోవాలనుకొంటున్నాయో.. ఆయా రాష్ట్రాలు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ఆ నోట్‌లో సూచించింది.డజనుకుపైగా రాష్ట్రాలు ఈ ప్రతిపాదనలు పంపాయి.

నోట్‌లో ప్రస్తావించిన కొన్ని నిబంధనలు

2021-22 నుంచి 2024-25 వరకు విద్యుత్తు సంస్కరణలు అమలు చేస్తే.. 0.5% అదనంగా 4% జీఎస్డీపీ వరకూ రుణాలు పొందే వెసులుబాటును రాష్ట్రాలకు ఇస్తాం. విద్యుత్తు సవరణ బిల్లు-2020 నియమాలను పాటించాలి. నష్టాలను తగ్గించేందుకు డిస్కంల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు పంపిణీని ఫ్రాంచైజీలకు, సబ్‌లైసెన్సీలకు అప్పగించాలి. డీబీటీ పద్ధతిలో వ్యవసాయం, గృహ వినియోగదారులకు విద్యుత్తు సబ్సిడీ చెల్లించాలి. ఏ రాష్ట్రాలు ఎఫ్‌ఆర్‌బీఎం పరిధికి మించి అప్పు తీసుకోవాలని అనుకొంటున్నాయో.. ఈ మేరకు అంగీకరిస్తున్నట్టు ప్రతిపాదనలు పంపించాలి. ఈ రూల్స్ రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకానికి ఆటంకంగా మారొచ్చన్న ఉద్దేశంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దీనిని వ్యతిరేకించింది. ఈ నియమాలకు ఒప్పుకొంటే డిస్కంల ప్రైవేటీకరణ జరుగొచ్చని అనుమానించింది. డీబీటీ పద్ధతిలో సబ్సిడీ చెల్లించాలంటే బోరు బావులకు మీటర్లు బిగించాల్సి ఉంటుందని, ఇది రైతాంగ సంక్షేమానికే నష్టమని భావించిన కేసీఆర్ సర్కారు ఈ నిబంధనలను ఒప్పుకోలేదు. దీంతో నాలుగేండ్లలో అప్పుల రూపంలో రాష్ట్రానికి సమకూరాల్సిన రూ. 30 వేల కోట్లు అందకుండా పోయాయి. అయినప్పటికీ, కేసీఆర్ మీటర్లు పెట్టేందుకు సుముఖత చూపలేదు.

ఎవరి వాదన నిజం?!

వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు బిగింపు లేదని తెలియజేసేలా.. 2017లోని ఉదయ్ స్కీంలో మీటర్ల బిగింపు విషయంలో వ్యవసాయ వినియోగదారులను మినహాయిస్తున్నట్టు స్పష్టంగా పేర్కొన్నారు. అందుకే, అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు దానికి ఒప్పుకొన్నది. తర్వాత 2021లో తీసుకొచ్చిన నోట్‌లో వ్యవసాయ మోటర్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు చేపట్టాలంటూ పరోక్షంగా కేంద్రం నిబంధనలు తీసుకురావడంతో దానిని కేసీఆర్ ప్రభుత్వం వ్యతిరేకించింది. అయితే, 2017లోని ఉదయ్ స్కీంను, 2021 నోట్‌ను కలగలిపి.. రెండూ ఒకటే అనేలా భ్రమింపజేసిన సీఎం రేవంత్.. సాగు మీటర్లపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాల్జేయడానికి ప్రయత్నించారు. సాగు మోటర్లకు మీటర్లు పెట్టడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందటూ అబద్ధాలు వల్లె వేశారు. అది నిజం కాదు. ఒకవేళ నిజంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలనుకొంటే, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో ఆ వ్యాఖ్యలు చేసేవారు కాదని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

మోటర్లకు మీటర్లపై కేంద్రం విఫల యత్నాలు

వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, అప్పటి కేసీఆర్ ప్రభుత్వం దానికి ఒప్పుకోలేదు.

మీటర్లు పెట్టనివ్వలేదని చెప్పిన నిర్మల

‘మోదీ ప్రభుత్వం మోటర్లకు మీటర్లు పెట్టుమని ఒత్తిడి తెస్తే.. నా తల తెగిపడినా సరే పెట్టను అని చెప్పిన’ అని మాజీ సీఎం కేసీఆర్ తరుచూ చెప్పేవారు. ఇది నిజమని.. 2023 నవంబర్ 21న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థమవుతున్నది. ‘రాష్ట్రాలు రుణం రూపంలో నిధులు సేకరించుకోవాలంటే మోటర్లకు మీటర్లు పెట్టాలని నిబంధన విధించాం. అన్ని రాష్ట్రాలు మోటర్లకు మీటర్లు పెట్టి నిధులు తీసుకున్నాయి. తెలంగాణలో మాత్రం పెట్టలేదు. నిధుల సేకరణకు మేం అనుమతి ఇవ్వలేదు’ అని ఆమె హైదరాబాద్‌లో మీడియా ముఖంగా చెప్పారు.

2020 ఏప్రిల్ 17: రాష్ట్రాలకు పంపిన ముసాయిదాలో.. ‘రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పొందే వర్గాల నుంచి (సాగు రంగం సహా) డిస్కంలు ముందుగా బిల్లులు వసూలు చేయాలి. ఆ తర్వాత కావాలంటే నగదు బదిలీ రూపంలో వారికి తిరిగి ఇవ్వవచ్చు’ అని పేర్కొన్నది. దీనికి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఒప్పుకోలేదు.

2020 డిసెంబర్ 31: విద్యుత్తు వినియోగదారుల హక్కుల నిబంధనల్లో.. ‘మీటర్లు లేకుండా విద్యుత్తు కనెక్షన్ జారీ చేయరాదు’ అని కేంద్రం స్పష్టం చేసింది. దీనిని కూడా అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు వ్యతిరేకించింది.

2021 ఫిబ్రవరి 5: రాష్ట్రాలకు పంపిన విద్యుత్తు చట్ట సవరణ రెండో ముసాయిదా ప్రకారం.. ‘ఏ రంగంలో అయినా విద్యుత్తు కనెక్షన్‌కు మీటర్ తప్పనిసరి’ అని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై తెలంగాణ సహా పలు రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి.

2021 ఏప్రిల్ 27: జాతీయ విద్యుత్తు విధాన ముసాయిదాలో.. తాము ఇస్తున్న ఈ పాలసీ నోటిఫికేషన్ వెలువడిన ఏడాదిలోగా మీటర్లు బిగించాలని ఆదేశించింది. దీనిని కూడా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఖండించింది.

2021 అక్టోబర్ 6: కొత్త ఆడిట్ నిబంధనల ప్రకారం.. ‘మూడేండ్లలో వినియోగదారులందరికీ కమ్యూనికేబుల్ మీటర్లు బిగించాలి’ అని కేంద్రం ఆదేశించింది. రైతుల మోటర్లకు మీటర్లు బిగించడమే దీని లక్ష్యం. ఈ ప్రతిపాదనను అప్పటి సీఎం కేసీఆర్ వ్యతిరేకించారు. అయితే, అప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న కాంగ్రెస్‌గానీ, ఇతర పక్షాలుగానీ మోటర్లకు మీటర్ల విషయంలో కేంద్రాన్ని నిలదీయకపోవడం గమనార్హం.